# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-07-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు రెవెన్యూ శాఖ, పీ4 విధానంపై సమీక్ష నిర్వహిస్తున్నారు.**
2. **ప్రకాశం జిల్లాలోని మార్కాపురం నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు శంకుస్థాపన చేశారు.**
3. **రాష్ట్రంలో నూతన సాంకేతిక విధానంలో రహదారుల నిర్మాణాన్ని చేపట్టామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.**
4. **ఉపాధ్యాయ డీఎస్సీ పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.**
5. **ప్రముఖ ఆధ్యాత్మిక తత్వవేత్త స్వామి వివేకానంద వర్ధంతి ఈరోజు.**

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో రెవెన్యూ శాఖలో భూ సమస్యల పరిష్కారం, ఇందుకోసం ఏడాది కాలంలో తీసుకున్న చర్యలు, సులభతర రెవెన్యూ సేవలు వంటి అంశాలపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు. అనంతరం రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ, ప్రయివేట్, ప్రజల భాగస్వామ్యం పీ4 పై స మీక్ష నిర్వహించనున్నారు.

--------------------------

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, కె. పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి ఒక వెయ్యి 290 కోట్ల రూపాయలతో జలజీవన్ మిషన్ కింద చేపట్టిన తాగు నీటి పథకం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహిస్తున్న బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

--------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ నివాళులర్పించారు. అలాగే జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు.

మరోవైపు.. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో జరిగిన పింగళి వెంకయ్య వర్ధంతి కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ కొనకళ్ళ నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

..వాయిస్.. 27 సెకన్లు

---------------------------

ఉపాధ్యాయుల పరీక్షలు- డీఎస్సీని 23 రోజుల్లో అన్ని విభాగాల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు డీఎస్సీ నిర్వహించిన అధికారులకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ రోజు అభినందనలు తెలిపారు. ఇప్పటికే డీఎస్సీ ప్రాథమిక 'కీ' విడుదల చేశామని, అభ్యర్థనలు పరిశీలించాక తుది 'కీ' విడుదల చేస్తామన్నారు. పరీక్షలు పారదర్శకంగా జరిగాయని, ఎస్సీ ఉప వర్గీకరణ, క్రీడా కోటా వంటి నిబంధనలు పాటించామని తెలిపారు. 3 లక్షల 36 వేల మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారని, 92.9శాతం మంది పరీక్షలకు హాజరయ్యారని లోకేశ్ వెల్లడించారు.

---------------------------

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామంలో కేంద్ర యోగా, సహజ చికిత్స పరిశోధన సంస్థతో పాటు 100 పడకల ఆసుపత్రి, సిబ్బంది గృహ సముదాయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. 15 ఎకరాల విస్తీర్ణంలో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టును నిర్మించనుందని ఈ మేరకు కేంద్ర మంత్రి ఒక వీడియో సందేశంలో తెలుపుతూ,

వాయిస్ 37 సెకన్లు

---------------------------

ప్రముఖ ఆధ్యాత్మిక తత్వవేత్త స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా దేశ ప్రజలు ఆయన చేసిన బోధనలు, సందేశాలను స్మరించుకుంటున్నారు. ప్రముఖ వేదాంత తత్వవేత్త రామకృష్ణ పరమహంసకు ప్రియ శిష్యులైన స్వామి వివేకానంద 1863 జనవరి 12వ తేదీన జన్మించారు. యోగ తత్వ శాస్త్రాలపై ఆయన బోధనలు, ఇచ్చిన సందేశాలు యువతపై గణనీయమైన ప్రభావం చూపి.. వారు సన్మార్గంలో నడిచేలా చేశాయి. 1902 జులై 4వ తేదీన ఆయన తుదిశ్వాస విడిచారు.

---------------------------

రాష్ట్రంలో డానిష్ ఆస్ఫాల్ట్ ఫైబర్ నూతన సాంకేతిక విధానంలో రహదారుల నిర్మాణాన్ని చేపట్టామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో ముదిగేడు - సంజామల మధ్య నిర్మించనున్న 2 వరుసల రహదారి నిర్మాణ పనులను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డానిష్ ఫైబర్ సాంకేతిక విధానం ద్వారా రహదారులు ఎక్కువ కాలం మన్నేలా తక్కువ వ్యయంతో నిర్మిస్తున్నామని చెప్పారు. పర్యావరణ అనుకూల రహదారులే లక్ష్యంగా బనగానపల్లె నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించామని తెలిపారు.

---------------------------

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజా సంక్షేమానికి ప్రాధ్యాన్యత ఇచ్చామని జలవనరుల శాఖ మంత్రి

నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సూపర్ సిక్స్ హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని మంత్రి వివరించారు.

---------------------------

రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని బిసి సంక్షేమ శాఖమంత్రి ఎస్. సవిత అన్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడారు. తిరుమలలో సామాన్య భక్తులకు టిటిడి అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తోందని మంత్రి తెలుపుతూ...

..వాయిస్... 27 సెకన్లు

---------------------------

పశ్చిమగోదావరి జిల్లాలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కేంద్ర బృందం ఈరోజు నుండి పర్యటిస్తున్నారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ ఉత్తమ పంచాయతీలు ఎంపికలో భాగంగా జిల్లాలోని 25 గ్రామ పంచాయతీలలో రోజుకి రెండు గ్రామాలు చొప్పున 20 రోజులు కేంద్ర బృందం పర్యటిస్తుందని చెప్పారు. ఈ మేరకు బృందం సభ్యులు గ్రామాలలో సేకరించనున్న అంశాలపై జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర బృందం ప్రజల నుండి అభిప్రాయాలను చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిషేధం, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై క్షేత్రస్థాయి అధ్యయనం చేస్తుందని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి జి.లక్ష్మి ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

నడికుడి-శ్రీకాళహస్తి మార్గంలో నూతనంగా నిర్మించిన న్యూపిడుగురాళ్ల-శావల్యాపురం రైలు మార్గంలో ప్రయాణికుల రైలు ఈ రోజు నుంచి రాకపోకలు సాగిస్తోందని గుంటూరు రైల్వే అధికారులు తెలిపారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నెమలపురి, రోంపిచర్ల రైల్వే స్టేషన్లలో టికెట్ల విక్రయ కేంద్రాలను రైల్వే శాఖ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రైలు ఈరోజు నుంచి వారానికి ఒకసారి నడుస్తుందని వివరించారు.నాందేడ్ నుంచి బయలుదేరే ఈ ప్రత్యేక రైలు నడికుడి, పిడుగురాళ్ల, నెమలిపురి, రొంపిచర్ల, శావల్యాపురం, వినుకొండ, మార్కాపురం, దొనకొండ, కంభం, నంద్యాల మీదుగా తిరుపతి చేరుకుంటుందని తెలిపారు.

=====================